# కూడలి

సి. సుజాత





దీపాల వరుసల నీడలు నీళ్ల మీద వయ్యారాలు పోతూ కదులుతున్నాయి. లేక్ చుట్టూ నియాన్ లైట్లు. చిమ్మ చీకట్లో తాజ్ బంజారా చమక్‌మంటూ మెరుస్తోంది.

చిన్ని లెమన్ పీస్ వేసి గ్లాసు నింపాడు వెయిటర్. మరీ అంత వినయానికి చిరాకని పించింది శైలజకి. వంగి గ్లాసందుకుని సుధాకర్ వంక చూసింది.

వెయిటర్ కంటే వృత్తిధర్మం. చెవుల దగ్గర వంగీ, చేతులు కట్టుకొని, గుసగుసల్తో వినపడకుండా మాట్లాడి చంపుకు తిని... ఈ సుధాకర్‌గాడికేం ఖర్మో అనిపించింది ఒక్క క్షణం.

'నాకు అనవసరం' అనుకొంది ఒక్కసారి భుజాలు ఎగరేసి!

తెల్లని ఇస్త్రీ చీర, చిన్న ముడీ, సెంట్ స్ప్రే అంతా పర్‌ఫెక్ట్‌గానే వుంది పైపైకి తనను తాను చూసుకుంటే

'జీవితం సంగతి చెప్పు' అడుగుతోంది లోలోపలి మనసు.

ఆగని నిట్టూర్పు ఎక్కడి నుంచో కోసుకుంటూ బయటకొచ్చింది

'బాగా వుండటం వుండకపోవడానికి కొలతలు ఎక్కడున్నాయి'

ఏదీ ఆలోచించాలనిపించడం లేదు. తలతిప్పి చుట్టూ చూసింది.

పాతిక టేబుల్స్ వున్నాయి. ఎక్కడా ఖాళీ లేదు. వట్టి భోజనం కోసం అయితే ఇక్కడి దాకా ఎంతో మంది రారు.

స్టేటస్... కేవలం గొప్ప...

'చెప్పండి శైలూ' అన్నాడు సుధాకర్

ఏకవచనంలోకి దిగుతున్నాడు అనుకొంది శైలజ

ఖాళీ అవుతున్న గ్లాస్ వంకే తదేకంగా చూస్తున్న శైలజ కళ్ళెత్తి అతని వైపు చూసింది.

డ్రాయింగ్ రూమ్‌లో షోకేస్‌లో వున్న బొమ్మ వంక 'ఇది నా సొంతం' అన్న ఫీలింగ్‌తో సర్వస్వతంత్రంతో చూస్తున్నట్లు అనిపించింది ఒక్క క్షణం.

తను ఎప్పుడూ వూహించే తనకి మాత్రమే వినపడే పెదవుల భాష గుర్తుకొచ్చింది.

కాస్సేపు వీడి మాటలు వినడం మానేస్తే అస్సలు విషయం పట్టేయమా? ఉత్సాహం వచ్చింది శైలజకు

అయినా కొత్తగా ఏం వినాలి కనుక. వారం రోజుల నుంచి ఆఫీస్ చుట్టూ తిరుగుతూనే వున్నాడు. పాత స్నేహం గుర్తు చేసుకొనే బంధుత్వాలు తవ్వాడు. కాలేజీ రోజులు గొప్ప మధురానుభూతులు అన్నంత లెవల్స్ చూపెట్టాడు. లోలోపల మినిస్టర్‌గారి చేత ఫైలుపైన సంతకం చేయించుకోవాలని వీడి తాపత్రయం... నిముషంలో అర్థం అయింది వీడి విషయం. వీడి ఫైలు పైన సంతకం ఎంత సేపు. కానీ చూపెట్టిన నక్కవినయం... మనసు లేని స్నేహం... దానికో బిల్డప్... వళ్లు మండింది. సూటిగా శైలజా నేను ఫలానావాడ్ని నాకు సహాయం చెయ్యవా' అని హాయిగా ఎందుకు బతకరు. ఇంత హిపోక్రసీ ఎందుకు. అందుకే తను వాడి పని చస్తే చేయదు. తిరగనీ... బోలెడన్ని అబద్ధాలు చెప్పనీ... మహా నటుడిలా యాతన పడనీ! ఈ సరదా చేతులారా చంపేసుకోవడం ఎందుకు?

'అయితే ఇదేం సరదా... వాడితో మందు పార్టీకి పోవాలా... నాకు భలే చిరాగ్గా వుంది' అన్నాడు ప్రతాప్ ఉదయం వీడిగోల భరించి- నవ్వుతూ గేటు దాకా సాగనంపి వచ్చాక.

అప్పటి వరకూ బంజారాలో తిండి తప్ప మందు వుంటుందని తన బుర్రలోకి రానే లేదు. ప్రతాప్ విసుక్కొన్నాకే తిక్క తిక్కగా మాట్లాడాలనిపించింది.

'నువ్వెపుడూ ఎవరితోనూ వెళ్ళవా?' అంటుంటే వెర్రికోపం వచ్చింది ప్రతాప్‌కి.

'ఛా ఛో తిరుగుబోతువీ, తాగుబోతువీ అయిపో... ఆ స్టాంప్ ఒక్కటే తక్కువ' అన్నాడు చీదరగా మొకం పెట్టి.

'ప్రతాప్ ఎందుకు నా ప్రైవసీలోకి అడుగేస్తావు. నీ గురించి నేనెప్పుడూ మట్లాడలేదు. రాత్రుళ్ళకు రాత్రుళ్లు ఎక్కడ తిరిగినా నేను అడగలేదు. నా సంగతి నేను చూసుకోగలను... నేనే- పాపాయినా' తన నోట్లో మాట నోట్లో వుండగానే ఎగబడిపోయాడు అతను.

'నీ మొకాన్నే ఉమ్మేస్తారు. అందరూ ఎలా వున్నారు... నువ్వెలా వున్నావూ. నీకిలాంటి పాడు బుద్ధులు వస్తున్నాయేం.. పార్టీలు, తాగడం... ఈ డ్రెస్‌లు... పిచ్చి పాటలు వినడం... ఏమిటా వేషాలూ'

'నాకేది బావుంటుందో నువ్వే డిసైడ్ చేసి చెప్తావన్న మాట'

'నేను చెప్తే వినే స్థితిలో వున్నావా? నువు గొప్ప పొజిషన్‌లో వున్నావు... నీ కళ్ళకు మనుషులు అనుతున్నారా ఇప్పుడు... నిన్ను భరించడం నా వల్ల కాదు తల్లీ.. నేను కిరణ్‌కి కూడా చెప్పాను... మా పరువు పోతోంది'

'అదీ అలాగే అందా'

ప్రతాప్ పళ్లునూరుకొన్నాడు పైకి శబ్దం వచ్చేట్లు.

'అదెందుకంటుందమ్మా అది నీ కూతురు...'

నవ్వొచ్చింది శైలజకు

'ఏమిటీ మీరే నవ్వుకుంటున్నారూ. ఆ జోక్ ఏమిటో చెపితే మేమూ నవ్వుతాంగా!

అన్నాడు సుధాకర్

అతని పక్కనే కూర్చుని తాపీగా టేబుల్ పైకి వచ్చిన ప్రతి ఐటమూ తీరిగ్గా తింటున్న శంకరం కూడా తిండి ఆపేసి మొకం పైకి నవ్వు తెచ్చాడు

శైలజకి నవ్వు ఆగలేదు

'ఈ వెధవ పార్టీతో తనను బుట్టలో వేశామనీ, ఈ కాస్త మందుకీ రెండొందల భోజనానికీ తను ఫ్లాట్‌గా పడిపోయిందని వాళ్ళిద్దరూ నిర్ణయించుకొని వుంటారు.

'మరి నువ్వు ఎందుకు వచ్చినట్లో... ఈ తిండి మందు కోసం కాదా? లోలోపల ఇంకో ప్రశ్న వినపడుతూనే వుంది.

లోపలకి తొంగి చూసే సాహసం చేయాలని లేదు. ఏ సమాధానమూ తన దగ్గర సిద్ధంగా లేదు. ఒక అశాంతి, మనసు మెలితిప్పే ఒక వెలితి, పూరించు కొనే అవకాశం లేని ఖాళీ డొల్ల లాంటి బతుకును భరించలేక తనలోకి తను పారిపోవాలని చేసే దిక్కుమాలిన ప్రయత్నం. ఇందులో మంచి, చెడూ, న్యాయం, అధర్మం, అన్యాయం, శీలం వగైరాల ప్రస్తావన లేదు.

జంట కవుల్లా శంకరం, సుధాకర్ ఏదో ఒక పిచ్చి టాపిక్ మాట్లాడుతూనే వున్నారు. ఒకడు యుద్ధం వద్దంటాడు. రెండోవాడు జయలలిత మళ్ళీ జీవించడం ఎంత ఘోరం అంటాడు. ఆవిడ అల్లా

భూస్థాపితం కాకపోవడం తన గుండె కోసిందంటాడు. అటు తమిళనాడుకీ, ఇటు అమెరికాకు రిప్రజెంటేటివ్‌ల్లాగా...

'నువ్వూ జయలలితలానే అందంగా వున్నావు శైలూ' అన్నాడు సుధాకర్ వున్నట్టుండి.

శైలజ నవ్వు ఆపి అతని వైపు చూసింది.

'థాంక్స్' అన్నది... 'అన్నట్లు సుధాకర్ ఈ మధ్య కాలంలో నువ్వు కావేరిని ఎపుడయినా ఇలాంటి మాటలతో పొగిడావా?' సుధాకర్ మాట్లాడకుండా గ్లాసులో వైన్ తాగడం మొదలుపెట్టాడు.

'అబ్బో మూడ్ పాడు చేయడంలో యమునకు నువ్వు డిట్టో' అన్నాడు

'ఇందులో నీ మూడ్ పాడవటానికి ఏముందీ. కావేరిని నిన్ననేగా చూశాను. నా కంటే సన్నగా చక్కగా వుంది. ఎంత దిగులుగా వుందో. నువ్వూ ప్రతాపూ ఆ వరండాలో సిగరెట్లు తగలేస్తుంటిరే అప్పుడే కాస్సేపు మాట్లాడుకున్నాం. 'బిజినెస్ తప్ప నీకు ఇల్లూ, వాకిలీ పట్టవనీ తన మొకం అస్సలు చూడవనీ' చెప్పింది... అది గుర్తొచ్చి అన్నాలే అన్నది శైలజ.

'చెప్పలా దానికి మానర్స్ తెలియవు. నీ అంత యాక్టివ్‌గా యమున వుందా?'

'బహుశా ఆమె వుండే అవకాశం లేదు. నిన్న నువ్వూ ప్రతాపూ కలిసి మన పాత ఫ్రెండ్స్‌పైన వేసిన జోకులు, వర్ణన కంటే మానర్‌లెస్‌గా వున్నాయా ఆవిడ మాటలు. పైగా నేను చేసే ఉద్యోగం, అస్తమానం మాట్లాడే నీలాటి గొప్పవాళ్ళతో డీలింగ్సూ... నా స్వభావం... నాకు వచ్చే అవకాశాలూ... నా పబ్లిక్, ప్రైవేట్ లైఫ్‌కీ యమునకీ తేడా లేదా!

సుధాకర్ మాట్లాడలేదు.

దూరంగా డిస్కో జరుగుతోంది. అటు వైపు డయాస్ పై నుంచి సైతాన్ వేషం వేసుకొన్న కుర్రాడు, మొకానికి మాస్క్, బ్లాక్ డ్రస్, వెనుక పొడుగ్గా వేలాడే నల్లని సిల్క్ టెయిల్‌తో వెనక్కి దూకి వచ్చాడు. ఇరవైఏళ్లుంటాయి. ఆ వయసులో వుండే గ్రేస్, వేగం, దూకడంలో ఈజ్‌నెస్ శైలజ ముచ్చటగా చూసిందతని వైపు... మాస్క్ తీసి ఫ్రెండ్లీగా చిరునవ్వు నవ్వాడు సైతాన్ కుర్రాడు. శైలజ చేతి వేళ్లు కదిలించి హలో అంది.

మళ్ళీ తలతప్పి బంజారా హోటల్ చుట్టూ వున్న లేక్ వైపు చూడటం మొదలుపెట్టింది. తను కూర్చున్న చోటు నుంచి వ్యూపాయింట్. దీపాలు, చెట్లు. మళ్ళీ మనసులో తుపాన్ రేగుతోంది.

ఎంత తమాషాగా మాట్లాడుతాడు బాధ్యతలు పిల్లలు అతని అవసరాలు అంతేనా తనంతా... ప్రత్యేకంగా తన కోసంగా తనకేం వద్దా. తన జీవితం ప్రతాప్ డిసైడ్ చేసి ఇవ్వాలా? ప్రతాప్ కంట్రీక్లబ్‌లో పాతికేళ్లుగా మెంబరు. చిత్తుగా తాగి ఎన్నిసార్లు వచ్చాడు. బోలెడన్ని అఫైర్లు. కొట్లాటలూ, యుద్ధాలూ జరిగాయి. చల్లబడ్డారు. మనసును మోసం చేసుకోవడం మొదలుపెట్టాక జీవితం గాడిన పడ్డది. ఒక నిష్ఠుర నిజానికి మనసు ప్రిపేరయింది. ఇద్దరి జీతం వుంటేనే ఇల్లు కట్టిన లోన్ తీరుతుంది. ఇద్దరి పిల్లల చదువులు, ఉమ్మడి చుట్టాలు, బాధ్యతలు. ఈ కొంప ఒక భారం తెలియనివ్వని బ్రహ్మాండమైన పర్వతం. అదెప్పుడు ఎలా నెప్పి తెలియకుండా నెత్తిమీదకు ఎక్కిందో అర్థమే కాలేదు. దించడం తన తరమా? గడుస్తున్న జీవితం అంతా ఎన్నో డిమాండ్లకు బదులిస్తూ తీరుస్తూ ఒక కట్టుబానిస జీవితం? ఆనందానికి నిర్వచనం ఒక మంచి జీతం వచ్చే ఉద్యోగం ఇల్లు, కాస్త బ్యాంక్ బాలెన్సూ, తన్నుకోకుండా బతకడం అయితే మస్త్ ఆనందం. మనసులో చెప్పలేని వెల్తి. ఇల్లంతా సంతోషం, సౌకర్యం సమకూర్చడం కోసం తను బొంగరమై పోవడం, యంత్రం అవటం...! అలిసిపోతుంది తను. మానసిక అసంతృప్తి మొత్తం జీవితాన్ని అస్తవ్యస్తం చేస్తోంది. దీన్లోంచి బయటకు రావాలి. అందరికీ కుదురుగా నచ్చిన ఒక చట్రంలోంచి పారిపోవాలి.

'అంటే తాగుడూ... ఇంకోడితో సంబంధమూనా!'

సుధాకర్ నవ్వుకు ఉలిక్కిపడి అతని వైపు చూసింది శైలజ. 'తమాషాకు అన్నానోయ్ శైలూ. పదివేల బిల్లు మిమ్మల్ని ఇమ్మంటానా. నోడౌట్ మీరు ఉలిక్కిపడ్డారు. అయామ్ హియర్ మేడమ్... నో ప్రాబ్లం.. యుకెన్ టేక్ సమ్ మోర్!

శైలజ నవ్వీ అతని పెదవుల వంక చూసింది. ఆ రెండు పెదవులూ కదులుతూ వదిలే మాటలు వేరు. మనసులోంచి తనకు వినిపించే మాటలు వేరు అనిపిస్తోంది. ఈ భాగ్యానికి వీడి మనసంతా శోధించనక్కర్లేదు

శైలజకి ఇప్పటికి అయోమయం తగ్గింది. బిల్లు నువ్విస్తావా అని వాడు వాగి వుంటాడు. తను ఏదో ఆలోచనలో పడి వెర్రిమొకం వేసుకొని చూచి వుంటుంది. అయినా తనెందుకు ఇవ్వాలి. వాడికి తనతో పని వుంది. ఆ విషయం ప్రతిశ్వాసలోనూ అతనికి గుర్తువుంది. వెధవ పార్టీ పేరుతో పాత స్నేహం పేరుతో తనకు బ్రష్ వేస్తున్నాడు. అతనొకందుకు పోస్తుంటే తనొకందుకు తాగుతోంది అంతే.


శైలజ కుర్చీ వెనక్కి తన్నేసి లేచింది.

'సుధాకర్... థాంక్స్ ఫర్ యువర్ పార్టీ... నేనింక వెళతాను. నేను కాస్సేపు అలా నడుస్తూ వెళతాను. జస్ట్ ఫర్ ఎ ఛేంజ్...'

'అయ్యబాబోయ్. పది దాటుతోంది. ఇప్పుడు నిన్ను వంటరిగా పంపితే ప్రతాప్ నన్ను బతకనిస్తారా?' అన్నాడు సుధాకర్

శైలజ నవ్వీ అతని పెదవుల వంక చూసింది. ఆ రెండు పెదవులూ కదులుతూ వదిలే మాటలు వేరు. మనసులోంచి తనకు వినిపించే మాటలు వేరు అనిపిస్తోంది. ఈ భాగ్యానికి వీడి మనసంతా శోధించనక్కర్లేదు. జస్ట్ కామన్‌సెన్స్ ఉపయోగిస్తే చాలు. మనసులో వీడేమనుకుంటున్నాడో తేలుతుంది.

'పదివేలు వదిలాయి. ఈ తద్దినం రేపయినా సంతకం పెట్టిస్తుందో లేదో... దాని మొకం పగలు చూస్తే రాత్రికి కల్లోకి వచ్చేట్టుంది. ఆ షోకులూ, తాగుడూ, పార్టీలూ... దీన్ని భరించేవాడున్నాడే ఆ ప్రతాప్‌గాడు వాడికి నమస్కారం పెట్టాలి. పెళ్లాం కింద చాలని చవట. వాడ్ని వెధవని చేసి...'



అవతలి వాడి మనసు పలుకుతుందని తను ఊహిస్తున్న పెదవుల బాషకు తెరలు తెరలుగా నవ్వొస్తోంది శైలజకు. తమ జోక్ బాగా పేలిందని సుధాకర్ గాడి చెంచా శంకరం నవ్వాడు.

శైలజ బంజారా హోటల్ కాలిబాటగుండా బయటకి వచ్చింది. హోటల్ చుట్టూ వున్న లేక్ వైపు ఒకసారి చూసింది. బహుశా ఈ దీపాల నీడలు చూసేందుకు తను రాకపోవచ్చు. ఒక్క నిముషం కూడా ఈ పార్టీ, తాగిన మందు తన లోపలి డొల్లని గుర్తు రాకుండా చేయలేకపోయాయి. ఇంకేం ఉపయోగం!

జామపళ్ళు, అరటి పళ్లు అమ్మే తోపుడు బండ్లని దాటుకూంటూ బస్టాప్‌లో నిలబడింది. జనం పల్చగా వున్నారు. కళ్లు తిరుగుతున్నట్లు అనిపిస్తోంది. ఎదురుగా వచ్చే ఆటో ఆపి ఎక్కేసింది.

చల్లని గాలి రివ్వుమని శబ్దం చేస్తూ చెవుల్లోకి వినబడుతోంది. చీర చెంగు మెడచుట్టూ కప్పుకొంది శైలజ.

ఖాళీగా వున్న ఈ ప్రపంచంలో తనొక్కతే ఒంటరిగా మిగిలిపోయిన ఫీలింగ్. ఎందుకిలాంటి నెగటివ్ ఆలోచనలు వస్తున్నాయి. తను ఇంకొకళ్ళలాగా ఎందుకు మారిపోవాలని చూస్తోంది. తను దొంగ అయిపోతే, అవతలి మనిషి అవసరంతో ఆడుకోవడం తనకు సరదా అయితే కొన్నాళ్ళకు అదే జీవితం అయితే సరిపోతుందా? తన వంటరితనం ప్రతాప్ దగ్గరనుంచి పారిపోతే సరిపోతుందా?

తను గంటన్నరపాటు గడిపిన వాతావరణం గుర్తొచ్చింది. అక్కడయినా తనకు శాంతి, స్నేహం వంటివి వున్నాయనే వెళ్ళిందా? ఎవరిదో అవసరం... తనకు కాలక్షేపం... ప్రతాప్... తను ఏ పాయింట్ దగ్గర దూరం దూరం జరిగారు. ఒక మూసబొమ్మ మారిపోతూ మారిపోతూ కొత్తరూపం తీసుకోవడం ప్రతాప్‌కు నచ్చలేదు. ఒకప్పుడు అతను ఎంచుకొన్న మంచి మోడల్ తను. ఆ మోడల్‌ని అతను షోకేసులో పెట్టి చూసుకోలేదు. ప్రతాప్ ఈ ప్రపంచంలోకి ప్రవేశపెట్టిన ఆ మోడల్ బొమ్మకాదు. ప్రాణం వున్న మనిషి. ఆలోచన, ఆశ, ఆసక్తి లాంటి మానవసహజమైన లక్షణాలతో పరుగు నేర్చుకున్న ఆ మోడల్ బొమ్మను ఆపే రిమోట్ ప్రతాప్ ముందే సంపాదించలేదు. ఆ మోడల్ పంజరపు పక్షి అయితే ఎలా వుండేదో... అది ఎగిరే మాటలు నేర్చిన మైనా... దాని నోరు నొక్కాలని ప్రతాప్ చేసే ప్రయ్నతం ఫలించకే ఈ యాతనలన్నీ...

'రైట్ తీసుకొని అలా లెఫ్ట్ చివరికిపో... ఆ చివర్నే ఇల్లు... ' అన్నది శైలజ.

ఆటో ఆగింది.

ఇల్లంతా లైట్లు వెలుగుతున్నాయి. ప్రతాప్ వరండాలోనే వున్నాడు.

'పాపాయి వచ్చింది' అన్నాడు గేటు దగ్గరకు వచ్చి. శైలజ తాగివచ్చి పడిపోతుందేమో నన్నంత గాబరాగా చూశాడు.

శైలజ గేటు తీసుకొని లోపలకు వచ్చింది. 'ఏమిటిట' అన్నది.

పాపాయి పరుగెట్టుకుంటూ వచ్చింది లోపలి నుంచి. శైలజ మెడ చుట్టూ చేతులు వేసింది. మెత్తని పూవుల దండ మెడచుట్టూ పడినట్లు అనిపించింది శైలజకి.

'తమరి రాకకు కారణం ఏమిటో'

'నాన్నాకు కాస్త కౌన్సిలింగ్! కుదరక పోతే నీతో డైవోర్స్'

'ఓహో నీ తీర్పా'

'అఫ్‌కోర్స్'

ప్రతాప్ వంక చూసింది శైలజ.

కూతుర్ని నొప్పించనూ లేక, శైలజ మీద కోపం ఆగకా మొకం రాయిలా పెట్టుకున్నాడు.

విరజాజి పందరి కింద నిలబడ్డారు తల్లీకూతురు.

వెన్నెల్లో నక్షత్రాల మాదిరిగా వున్నాయి విరజాజి పూవులు.

'నాన్న కోపం తగ్గనీ అమ్మా... నా ఎదుగుదలా, కెరీరిజం నచ్చాయని, నేను యువతరానికి రోల్‌మోడల్ కావాలని నాన్న నాకు ఎపుడూ చెప్పే కబుర్లు నిజమైతే- నువ్వూ అర్థం కావాలే మరి. అలా జరగలేదంటే ఆత్మశోధన ఆయనకే కాస్త అవసరం. మనమంతా కలిసే వుండాలనే నాకు భలే కోరికమ్మా. ఆ చిన్న ఆశ తీరదనే భయంతోనే పరుగెత్తుకొచ్చా' అన్నది కిరణ్.

ఆ అమ్మాయి కళ్లు తడిశాయి. ●